# కష్టానికి దక్కిన సత్కారం..

- తెలంగాణ స్టేట్ సర్జన్ అషోషియేషన్ బెస్ట్ సర్జన్‌గా డాక్టర్ శంకర్ నాయక్
- అమెరికా, జర్మనీ, చైనా, యుగండలో అత్యంత మెరుగైన సర్జరీలు
- కొత్తగూడెం ముద్దు బిడ్డకి అవార్డ్ దక్కడం పట్ల నియోజకవర్గ ప్రజలు ప్రశంసలు
- ఈ అవార్డు మరింత ఉత్సాహాన్ని నింపింది
- ప్రముఖ బెస్ట్ సర్జన్ డాక్టర్ శంకర్ నాయక్



**శామ్, అక్టోబర్08(కెరటం ప్రతినిధి)**

ఎన్నో ఏండ్ల నాటి కష్టానికి దక్కిన సత్కారం ఇది. తెలంగాణ స్టేట్ సర్జన్ అషోషియేషన్ బెస్ట్ సర్జన్‌గా డాక్టర్ శంకర్ నాయక్‌కు అవార్డు వరించింది. వేలాది ఆపరేషన్లు ఎంతో సమయస్ఫూర్తితో.. అధునాతన పద్దతులు అవలంభిస్తూ.. ఎందరికో పునర్జన్మ ప్రసాదించి వారి కుటుంబ సభ్యుల్లో ఆనందపు వెలుగులు నింపిన పేదల వైద్యుడు, ప్రముఖ సర్జన్ డాక్టర్ శంకర్ నాయక్ పేరు ఈ ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే కాదు తెలుగు రాష్ట్రాల్లో తెలియని వారు ఉండరంటే అతిశయోక్తి కాదు. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన తెలంగాణ స్టేట్ సర్జన్ అషోషియేషన్ సమావేశంలో బెస్ట్ సర్జన్‌గా ప్రముఖ డాక్టర్ శంకర్ నాయక్‌కి అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ శంకర్ నాయక్ మాట్లాడుతూ అమెరికా, జర్మనీ, చైనా, యుగాండాలో అత్యంత కీలక సర్జరీలు చేయడం వలన తెలంగాణ రాష్ట్రంలో బెస్ట్ సర్జన్‌గా 2023 అవార్డ్ దక్కిందన్నారు. ఈ అవార్డు రావడం చాలా సంతోషకరమని తెలిపారు. ఇప్పటికే తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాలతో పాటు విదేశాలలో కూడా చాలా సర్జరీలు చేశానని, ముందు ముందు కూడా చేస్తానని, వృత్తి తనకు దైవంతో సమానమని తెలిపారు. అవార్డ్ మన కొత్తగూడెం నియోజకవర్గం ముద్దు బిడ్డకి దక్కడం వలన నియోజకవర్గ ప్రజలు శంకర్ నాయక్‌కి ప్రశంసల వర్షం కురిపించారు.










## దశ దిన కార్యక్రమంలో పాల్గొన్న మల్లెల ఉషారాణి

**శామ్, అక్టోబర్08(కెరటం ప్రతినిధి)**

తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం రాష్ట్ర కార్యదర్శి, భారత రాష్ట్ర సమితి రాష్ట్ర నాయకులు దరిపల్లి శ్రీనివాస్ మాతృమూర్తి దరిపల్లి రత్తమ్మ దశ దిన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు, న్యాయవాది మల్లెల ఉషారాణి పాల్గొని దరిపల్లి రత్తమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించడం జరిగినది. ఈ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కుమ్మర సంఘం నాయకులు మల్లెల రామనాథం. కొండపల్లి రామకృష్ణ, కొయ్యడ బ్రహ్మం, రేణిగుంట్ల రవి, రంగా పాల్గొన్నారు. అదేవిధంగా పద్మశ్రీ అవార్డు గ్రహీత వనజీవి రామయ్యని పరామర్శించి అతని ఆరోగ్య పరిస్థితిని తెలుసుకోవడం జరిగినది.



## ఇండోర్ క్రీడా పోటీలు ప్రారంభం

**శామ్, అక్టోబర్08(కెరటం ప్రతినిధి)**

కొత్తగూడెం ఏరియాలో 2023-24 సంవత్సరంనకు డబ్ల్యూపిఎస్ అండ్ డిఏ స్పోర్ట్స్‌లో భాగంగా కొత్తగూడెం ఏరియాలోని ఆర్.సి.ఓ.ఏ క్లబ్, రుద్రంపూర్ నందు డిపార్ట్మెంటల్ ఇండోర్ గేమ్స్ షటిల్, కల్చరల్ ప్రోగ్రామ్స్ కొత్తగూడెం ఏరియా వారు ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కొత్తగూడెం ఏరియా సి.ఎం.ఓ.ఏ.ఐ ప్రెసిడెంట్ పాలడుగు శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్తగూడెం ఏరియాలో డిపార్ట్మెంటల్ గా నిర్వహిస్తున్న ఇండోర్ గేమ్స్‌లో పాల్గొని మంచి విజయం సాధించాలని ఇదే స్ఫూర్తితో కంపెనీ లెవెల్లో జరుగు ఇండోర్ గేమ్స్‌లో పాల్గొని కొత్తగూడెం ఏరియా కు మంచి పేరు తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ సమన్వయకర్త కొత్తగూడెం ఏరియా సిహెచ్.సాగర్, గౌస్, ప్రేమ్, జె.సదానందం, అశోక్, సౌజన్య, సుష్మ మరియు ఇతర క్రీడా సభ్యులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా ఘోష యాత్ర

### ఈనెల 13,14,15 తేదీల్లో నవ దుర్గా యాగం

**హైదరాబాద్, అక్టోబర్08(కెరటం ప్రతినిధి)**

నవ దుర్గా యాగం వరకు సాగే.. నవ దుర్గా యాగం - ద్రవ్య సమర్పణం, ఘోష యాత్ర, ఆదివారం ఘనంగా నిర్వహించారు. శామీర్‌పేట సమీపంలోని రత్నాలయం శ్రీ వేంకటేశ్వర ఆలయంలో ఈనెల 13,14,15 తేదీల్లో నవ దుర్గా యాగం జరగనుంది. ఈరోజు ఘోషా యాత్ర కమలానగర్‌లోని అయ్యప్ప దేవాలయం నుంచి లాల్‌బజార్‌లోని అయ్యప్ప ఆలయం వద్దకు వెళ్లి బోలారంలోని అయ్యప్ప ఆలయం వరకు సాగింది. శామీర్‌పేటలోని అలియాబాద్ క్రాస్‌రోడ్ సమీపంలోని రత్నాలయం శ్రీవేంకటేశ్వర ఆలయం వద్ద నవ దుర్గా యాగం వేదిక వద్దకు వందలాది మంది భక్తులు తరలివచ్చారు.

పట్టు గుడ్డపై పసుపు, ధర్భను సమర్పించడంతో ద్రవ్య సమర్పణం ప్రారంభమైంది, ఆ తర్వాత యాగశాలలో నైవేద్యాలు సమర్పించారు. ఇవన్నీ నవ దుర్గా యాగం, అన్నదానం కోసం భక్తులు చేసిన నిబద్ధతలో భాగంగా ఉన్నాయి. ఈ కార్యక్రమంలో బ్రహ్మశ్రీ నారాయణ్ జీ మండలేశ్వర్, ఉన్నికృష్ణన్ నంబూద్రి, టీఆర్ వెంకటేష్, మాధవన్ నంబూద్రి తదితరులు పాల్గొన్నారు. నవ దుర్గా యాగం అనేది దైవిక మార్గంలో మానవ కష్టాలను తొమ్మిది ప్రధాన రూపాలను తొలగించడానికి అసాధారణమైన, అతీంద్రియ ఆచారాలలో పాల్గొనడానికి ఒక అవకాశం. యాగం ప్రధానంగా ఎనిమిది ప్రధానమైన మానవ కష్టాలను అధిగమించడానికి, 36 హోమ కుండాలలో దైవిక మార్గంలో శ్రేయస్సును తీసుకురావడానికి నిర్వహించనున్నారు. ప్రతి యాగంలో 112 మంది భక్తులు ప్రత్యక్షంగా పాల్గొనడానికి వీలు కల్పిస్తుంది. నవ దుర్గా యాగంలో భక్తిశ్రద్ధలతో మూడు రోజులపాటు దుర్గామాత తొమ్మిది రూపాలను పూజిస్తారు.